❖•❖•❖ 6 ❖•❖•❖

# “లెండి, వెళ్ళుదుము”

*“అప్పుడాయన తన శిష్యులయొద్దకు వచ్చి – ఇక నిద్రపోయి అలసట తీర్చుకొనుడి; ఇదిగో ఆ గడియవచ్చి యున్నది; మనుష్యకుమారుడు పాపులచేతికి అప్పగింపబడుచున్నాడు;*

*లెండి వెళ్లుదుము; ఇదిగో నన్ను అప్పగించువాడు సమీపించి యున్నాడని వారితో చెప్పెను" (మత్తయి 26:45, 46).*

గెత్సేమనే తోటలో యేసు ప్రార్థన చేయు మూడవ వ్యవధిని ముగించుకొనిన తరువాత, నిద్రించుచుండిన తన అపొస్తలుల యొద్దకు తిరిగి వచ్చి, "ఇప్పుడు ఇక నిద్రపోండి, విశ్రాంతి తీసుకొనండి" అని చెప్పాడు (మత్తయి 26:45; KJV; ASV). NASB మరియు NIV అనువాదములు: "మీరు ఇంకా నిద్రపోతూనే విశ్రాంతి తీసుకొంటున్నారా?" అని యేసు వారిని ప్రశ్నించుచున్నట్లుగా చిత్రీకరించుచున్నవి. గ్రీకు భాషలో ఈ వాక్యభాగము ఒక ప్రశ్న కంటె ఎక్కువగా చేయవలసిన దాని గూర్చిన ఒక ప్రకటన గలదై యున్నది. యేసు చేసిన వ్యాఖ్యానముతో, "ప్రార్థన సమయము అయిపోయింది. ఈ గడియ నిమిత్తము మనము చేయవలసిన ఏర్పాట్లన్నీ సిద్ధము చేయబడ్డాయి. మెలకువగానుండి ప్రార్థించుట ద్వారా సంభవింపనైయున్న సంఘటనను తట్టుకొనుటకు మనలను సిద్ధము చేసుకొను సదావకాశము ఇప్పుడు మనలను దాటిపోయినది" అని ఆయన భావించియుండవచ్చును. "ఇప్పటికి నిద్రపోండి" అను మాటలు "పర్వాలేదు నిద్రపోండి, ప్రార్థించుచుండవలసిన సమయము అయిపోయింది" అను మాటలకు బదులైన అలంకారిక భాషగా ఉన్నట్లు అగుపించుచున్నది.

బహుశ యేసు ఈ మాటలు చెప్పిన అదే నిమిషములో, ఆయన తన కళ్లను పైకెత్తి మిణుకుమిణుకుమని వెలుగుచుండిన దీపాలు కెద్రోను వాగు దిశలో నుండినట్లు చూశాడు. నిశ్చయమైన ప్రశాంతతతోను తండ్రి చిత్తమును సాధ్యమైనంత సంపూర్తిగా పూర్తిచేయవలెనను దానిపై కేంద్రీకరింపబడిన మనస్సుతోను, "లెండి, వెళ్ళుదము" అని ఆయన తన పరిచర్యను ప్రారంభించినది మొదలుకొని ఎదురు చూచిన గడియ (యోహాను 2:4) ఇప్పుడు సమీపించినది. తనను తాను పాప పరిహారార్థ బలియాగముగా అర్పించుకొనవలసిన సమయము వచ్చినది; గెత్సేమనే తోటలో పట్టువిడువక చేసి ముగించిన ప్రార్థన తరువాత, ఆ గడియను ఎదుర్కొనుటకు ఇప్పుడు సిద్ధముగా ఉన్నాడు.

యేసు యొక్క చివరి రాత్రి మరియు రోజు గూర్చి దైవికమైన వృత్తాంతములలో గల వివరముల తరువాత వచ్చుచున్న విషయములు ఆయనను గూర్చిన ఒక దృశ్యమును అనగా, మన మనస్సులను వికసింపజేయు, మన ఆత్మలను కదిలించివేయు, మనము ఆయన కొరకు ప్రగాఢముగా అంకితము చేసుకొనునట్లు మనలను సవాలుచేయు దృశ్యమును మనముందుంచుచున్నవి. యేసు గెత్సేమనే తోటలో నుండి కుదుటపడిన హృదయముతో, స్పష్టముగా అచంచలమైన ఒక దృఢ సంకల్పముతో, గెలుపొందబడజాలని నిర్ణయముతో, బయటికి వచ్చాడు. నరకము యొక్క సమస్త శక్తులు తాను చేయవలెనని నిర్ణయించుకొన్న దానిని చేయకుండునట్లు ఆయనను ఆపలేకపోయారు; సాతాను వాదములన్నియు తన ప్రణాళికలను గూర్చి ఆయనలో విముఖత కలుగజేయలేకపోయాయి. ఒక ఒలీవ చెట్టు క్రింద, ఆయన దేవుని యెదుట సాగిలపడ్డాడు, తనను తాను దేవుని చిత్తమునకు సమర్పించుకొన్నాడు, ఆయన ఎప్పుడూ ఎదుర్కొనుచు పోరాడిన అంధకార దుష్ట శక్తులతో అత్యంత తీవ్రముగా పోరాడి వాటిని జయించాడు.

*తన ప్రార్థన స్థలమును విడిచి పెట్టి, ఆయనను సమీపించుచుండిన సమూహమును*

*కలుసుకొనుటకు తోట వెలుపలికి వెళ్లుచుండిన యేసు ఆ పరిస్థితి గూర్చిన పూర్తి అదుపును తన అధీనములో కలిగియుండెను.* యోహాను, ఆ తరువాత సంభవించిన సంఘటనలకు సంబంధించి ఇతర సువార్త రచయితల కంటె ఎక్కువ వివరములిచ్చాడు, “కావున యూదా సైనికులను, ప్రధానయాజకులు పరిసయ్యులు పంపిన బంట్రౌతులను వెంటబెట్టుకొని, దివిటీలతోను దీపములతోను ఆయుధములతోను అక్కడికి వచ్చెను” అని చెప్పాడు (యోహాను 18:3). ఇంకా, “యేసు తనకు సంభవింప బోవునవన్నియు ఎరిగినవాడై, వారియొద్దకు వెళ్లి – ‘మీరెవని వెదకుచున్నారని’ వారిని అడిగెను” అని కూడా చెప్పాడు (యోహాను 18:4), సంభవింపబోవుచుండినవన్ని యేసుకు సంపూర్తిగా ఎరుకే. పట్టబడుట, తీర్పు తీర్చబడుట, కొరడాలతో కొట్టబడుట, మరియు సిలువపై మరణించుట తన కంటికి ఎదురుగా కనబడుచున్నట్లు ఊహించుకొనగలిగాడు. ఇదంతా తెలిసియుండినప్పటికినీ, ఆయన తనను తాను తన శత్రువుల చేతికి అప్పగించుకొనుటకు వెంటనే ముందుకు వెళ్లాడు. ఆయనను కాపాడుటకు ఆయన పండ్రెండు సేనా వ్యూహములకంటె ఎక్కువ మంది దూతలను పిలువగలిగియుండెను (మత్తయి 26:53); ఆయన ఆనాటి అంధకారములోనికి నెమ్మదిగా జారిపోయి వారి చేతి నుండి తప్పించుకొనగలిగేవాడే (యోహాను 10:39). కానీ దానికి బదులుగా, నమ్మికతో ఉద్దేశపూర్వకంగా, ఆయన వారి యొద్దకు వెళ్లి, “మీరెవని వెదకుచున్నారు?” అని వారినడిగాడు (యోహాను 18:4బి).

సంభవించుచుండిన సమస్తము దైవికమైన ప్రణాళిక ప్రకారమైనదై యుండెను. యేసు ఆయన సిలువ వేయబడు సమయమును స్థలమును సహితము ఎన్నుకొన్నట్లుగానే, ఆయన పట్టబడు సమయమును మరియు స్థలమును ఎన్నుకొన్నాడు. “నేను దాని మరల తీసుకొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను; ... దాని పెట్టుటకు నాకు అధికారము కలదు, దాని తిరిగి తీసికొనుటకును నాకు అధికారము కలదు” అని ఆయన అంతకు మునుపు చెప్పాడు (యోహాను 10:17ఎ, 18బి). ఆయన మాటలు ఎంత యథార్థమైనవో ఈ తోటలో రుజువు చేశాడు. సిలువ కథ మానవుడు యేసుకు ఏం చేశాడను విషయము గూర్చిన కథయై యుండవలెనని ఉద్దేశింపబడలేదు, కానీ అది మానవుని కొరకు యేసు ఏం చేశాడను సత్యము గూర్చిన కథయైయున్నది.

*ఈ విషాదాంత సంఘటనలను వివరంగా ధ్యానించే ప్రతి ఒక్కరు వాటిని ఎదుర్కొనుటలో యేసు కనుపర్చిన ప్రశాంతత మరియు (ఆత్మ) స్థైర్యము చేత వారి హృదయాల్లో చెరగని ముద్ర వేయబడినవారు కావలెను.* ఆయన శరీరము దాని సహనమును దాటునట్లు ఆయాసపెట్ట బడునంత వరకు తోటలో ఆయన వేదనతో ప్రార్థించాడు, కానీ అటుతరువాత ఆయన దేవుని చిత్తము యెడల కనుపర్చిన లొంగుబాటును మరియు ఆయన లోక పాప పరిహారార్థము నిమిత్తము దేవుని శ్రమనొందు సేవకుడై యుండవలెనని ఆయన తీసుకొన్న తీర్మానమును ప్రతిబింబించిన కలతచెందని మానసిక ప్రశాంత చిత్తత కలిగియుండెను. సమస్త మానవుల అధిపతిగా, ఆయన తనను తాను మరియు ఆయనను చుట్టుముట్టియుండిన దౌర్జన్యపూరితమైన పరిస్థితులను దేవుని మహిమార్థమై తన అధీనములో ఉంచుకొన్నాడు. తోటలో ఎదురైన అంతటి భయంకరమైన శ్రమలు మరియు ఇంతటి రాచఠీవి గల ఘనతను ఎదుర్కొనుచు ద్రోహము మరియు వంచనతో నిండిన నిర్బంధములో నుండి యింకెవరు బయటికి రాగలరు? కేవలము ఒక పరిపూర్ణమైన మానవుడు మాత్రమే, మనుష్య కుమారుడును దేవుని

కుమారుడును అయినవాడు మాత్రమే, ఈ పని చేయగలడు!

గుమి కూడియుండిన గుంపు – "నజరేయుడైన యేసును వెదకుచున్నాము" అని ఆయనతో చెప్పినప్పుడు, ఆయన "ఆయనను నేనే" అని వారితో చెప్పాడు. జనసమూహము యొక్క నాయకులలో ముందు నిలుచుండిన కొందరు "వెనుకకు తగ్గి నేలమీద పడిరి" (యోహాను 18:5, 6). ఆయన తనను తాను వారి చేతులకు అప్పగించుకొన్నప్పుడు వారు వెనుకకు తగ్గునంతగా, వారి వెనుక నున్నవారిని గుద్దుకొనునంతగా ఉలిక్కిపడ్డారు. అప్పుడు, వారు బలమును కోల్పోయి నేలమీద పడ్డారు.

నేలకొరిగిన వారు కోలుకొని మరలా ఒకచోట కూడుకొన్న తరువాత, కత్తులు, గుదియలు, దీపములతో ఎదురుచూస్తూ ఆయన యెదుట మరలా నిలబడిపోయారు. రెండవసారి యేసు, "మీరు ఎవనిని వెదకుచున్నారు?" అని వారినడిగాడు. వారు ఎక్కడున్నారో ఏమిచేయుచుండిరో ఏమీ ఎరుగని వారై తికమకపడిన వారివలె, "నజరేయుడైన యేసును" అని చెప్పారు. అప్పుడు యేసు, "నేనే ఆయనని మీతో చెప్పితిని" అని వారితో అన్నాడు (18:7, 8). వారి రాకకు యేసుయిచ్చిన ప్రశాంతమైన ప్రతిస్పందన ఉద్రిక్తతతోకూడిన వారి ఆగ్రహమును మరియు వైరమును తగ్గించినది (వారిని తికమక పెట్టినది). ఆయన చేసిన అద్భుతముల గూర్చి వారు స్పష్టముగా ఆలోచించిన యెడల, యేసు తనను తాను వారికి అప్పగించుకొనుటకు ఆశించియుండనట్లయితే ఏ ఖడ్గమైనను, సైన్యమైనను, లేదా భూలోక రాజ్యములలో ఏదైనను యేసును పట్టుకొన జాలదని వారు గ్రహించెడివారే.

*ఈ విషమ గడియలో సహితము, యేసు తన స్వజనుల యెడల కలిగియుండిన తన ప్రగాఢ ప్రేమను ప్రదర్శించాడు.* ఆయనను పట్టుకొనుటకు వచ్చిన గుంపు "నజరేయుడైన యేసును" వెదకుచున్నారని చెప్పినది (యోహాను 18:7బి). అప్పుడు యేసు, "నేనే ఆయనని మీతో చెప్పితిని; గనుక మీరు నన్ను వెదకుచున్న యెడల, వీరిని పోనియ్యుడని" చెప్పాడు (యోహాను 18:8ఎ). "నీవు నాకు అనుగ్రహించిన వారిలో ఒకనినైనను నేను పోగొట్టుకొనలేదు" అని ఆయన చెప్పిన మాట నెరవేరునట్లు యేసు ఈలాగు చెప్పెనని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 18:9). వారి అపొస్తలత్వ పనిని వారు నెరవేర్చునట్లు ఆయన వారిని సిద్ధపరచుచూ ఆయన వారికి దారి చూపించుననియు వారిని కాపాడుననియు ప్రతిజ్ఞ చేసుకొంటూ, ఆయన తనను తాను వారికి అప్పగించుకొన్నాడు. యేసు చేసిన ప్రధాన యాజకత్వ ఘన ప్రార్థనలో, తన తండ్రితో యిలా మొర పెట్టాడు:

> నేను వారికొరకు ప్రార్థన చేయుచున్నాను; ... పరిశుద్ధుడవైన తండ్రీ, మనము ఏకమై యున్నలాగున వారును ఏకమై యుండునట్లు నీవు నాకు అనుగ్రహించిన నీ నామమందు వారిని కాపాడుము. నేను వారియొద్ద ఉండగా నీవు నాకు అనుగ్రహించిన వారిని నీ నామమందు కాపాడితిని; నేను వారిని భద్రపరచితిని గనుక లేఖనము నెరవేరునట్లు నాశన పుత్రుడు తప్ప వారిలో మరి ఎవడును నశింపలేదు (యోహాను 17:9–12).

ఇక్కడ, తోట ద్వారము దగ్గర, యేసు తన శిష్యులకును ఆయనను పట్టుకొనవలెనని వచ్చిన దౌర్జన్యపూరితమైన జనసమూహమునకును మధ్య తనను తాను ఉంచుకొన్నాడు. ఆయన తన తొల్లిటి జీవితము జీవించిన విధానమునకు తగినట్లుగా, ఆయన తన్నుతాను గూర్చి ఆలోచించుటకు బదులుగా తనతో కూడా ఉండిన వారిని గూర్చి ఆలోచించాడు.

"మీలో ప్రతివాడును తన సొంతకార్యములను మాత్రమే గాక యితరుల కార్యములను కూడ చూడవలెను" అని పౌలు అటుతరువాత వ్రాయనైయుండిన మాటలకు ఆయన నిదర్శనముగా నిలిచాడు (ఫిలిప్పీయులకు 2:4).

*ఆయన పట్టబడు విషయములో అమలు చేసిన పద్ధతి యూదా పశ్చాత్తాపముతో మారుమనస్సునొందునట్లు వానికి ఒక అదనపు అవకాశమునిచ్చినది.* యూదా ఎన్నుకొన నట్లయితే, యేసును గుర్తుపట్టుటలో యూదాకు అనవసరంగా ఉండునట్లు ఆయన పట్ట బడుటకు అనువైన పరిస్థితులను బుద్ధిపూర్వకముగానే రూపొందించుకొన్నాడు, ఇది స్పష్టముగా నున్నది. వారు సరియైన వ్యక్తినే పట్టుకొనగలరని గుమి కూడియుండిన జనసమూహములోని యాజకులకు ఖచ్చితముగా తెలియదు, గనుకనే యూదా అవసరమౌతాడని వారు అపేక్షించారు. వారు యూదాతో ఒక ఒప్పందమును కుదుర్చుకొని యేసును అప్పగించినందుకు యివ్వాల్సిన డబ్బును ముందుగానే ఇచ్చివేశారు. యూదా సమూహమంతటికిని ముందుగా నిలువబడి యుండగా, "ఇదిగో, మీరు వెదకుచున్నవాడను నేనే. గనుక నన్ను పట్టుకొని నన్నేమిచేయవలెనని పథకం వేసుకొన్నారో దాని ప్రకారమే చేయండి!" అని చెప్పుచున్నట్లుగా ఆయన వారి యెదుటికి వచ్చాడు. యేసు యొక్క ఈ చర్య యూదాను ఒక విశిష్టమైన పరిస్థితిలోనికి దింపినది. యేసు చెప్పిన మాటలు మరియు చేసిన చర్యల దృష్ట్యా, యేసును అప్పగించునను ఒప్పందమును యూదా ప్రధాన యాజకులతో కుదుర్చుకొన్నప్పటికిని అతడు యేసును గుర్తుపట్టాల్సిన అవసరం లేకుండినది. యూదా సహాయము అవసరము రాకుండునట్లు యేసు తనను తానే వారికి బయలు పర్చుకొన్నాడు.

జనసమూహము, దౌర్జన్యమును మరియు సంఘర్షణ సంబంధమైన అల్లరితో కూడిన అమితానందోత్సాహము కొరకు ఎదురుచూస్తూ, యేసు కనుపర్చిన తక్షణ ప్రతిస్పందన చేత నిరాయుధీ కరణము చేయబడినది. ఆయన ప్రవర్తన అల్లరితో నిండియుండిన దృశ్యమును నిమ్మళింప జేసినది; ఈ జనసమూహమునకు, యేసు పట్టబడుట ఒక శాంతి పూర్వకమును దాదాపుగా ఎటువంటి కష్టముకలుగని సంఘటనయైనది. ఇంకా, యేసు సృష్టించిన పరిస్థితిని విస్మరించి మరియు చేయుటకు ఒప్పుకొనినదానిని తిరస్కరించుటకైన ఈ చివరి అవకాశమును చేజార విడిచిపెట్టి, యూదా పట్టుకొనుటకు పరుగెత్తుకొని వచ్చిన పార్టీలో నుండి తప్పుకొని వారితో "బోధకుడా" అని చెప్పి ఆయనను ముద్దుపెట్టుకొన్నాడు. వెంటనే, సముహములో నుండిన సైనికులు వచ్చి ఆయన మీద పడి, ఆయనను పట్టుకొన్నారు.

యేసు పట్టబడిన ఈ ఘటనా భాగం మన ప్రభువు యొక్క లోపరహితమైన శీలము గూర్చి మనకు ఒక పరిజ్ఞానము నిచ్చుచున్నది. ఆయన ఎటువంటి రక్షకుడై యున్నాడు? ఆయన తన తండ్రి చిత్తమును నెనవేర్చుటకు ఎటువంటి శ్రమల గుండా వెళ్లవలసియున్నదను దానితో నిమిత్తము లేకుండా, యేసు తన తండ్రి చిత్తమునకు సంపూర్ణముగా లోబడుచుండెనని ఈ సన్నివేశము చిత్రీకరించుచున్నది. ఆయన ఆత్మస్థైర్యమును మరియు అదుపును, పరిపూర్ణమైన వివేకమును, పవిత్రతను, మరియు దైవీకమైన శక్తిని కలిగియుండెనని అది చూపించుచున్నది. ఈ దైవీకమైన గుణలక్షణములను కలిగియుండి, అవి ఎంతటి విపత్సూచక పరిస్థితులైనప్పటికిని ఆయన ఎల్లప్పుడు ఆ పరిస్థితులకు పై అధికారియైయుండును. ఇంకా, ఈ సంఘర్షణ తన గొఱ్ఱెల కొరకు ప్రాణమును పెట్టు మంచి కాపరిగా – అత్యంత విషమ పరిస్థితులలో నైనను తన కొరకంటె ముందు తన గొఱ్ఱెల కొరకే ప్రాణం పెట్టుటకు ప్రాముఖ్యతనిచ్చు కాపరిగా,

ఆయనను బయలుపర్చుచున్నది. ఒక ఆత్మ దారితప్పి దుష్టునివెంబడి వెళ్లుటకు బలమైన సుముఖతను కలిగియున్నప్పటికిని, ఆ ఆత్మను రక్షించుటకు దొరుకు చివరి అవకాశము కొరకు ఆయన ఎడతెరపిలేకుండా పోరాడు రక్షకుడని, ఈ అగ్ని పరీక్షతో ఆయన వ్యవహరించిన విధానము, మనకు గుర్తు చేయుచున్నది. హల్లేలూయ, ఆహా ఎంత గొప్ప రక్షకుడు!

❖◆❖◆❖

*యేసు మరణించుటకు వచ్చాడు. ఆయన జగదుత్పత్తి మొదలుకొని వధింపబడియున్న దేవుని గొర్రెపిల్లయై యుండెను. ఆయన సిలువ మరణము వెంటబడి తరుముతూ వెంబడించి పట్టుకొని అనుకున్న దానిని సాధించుటకు ఏర్పరచబడిన సమూహముచేసిన పనియొక్క ఫలితము కాదు. ఆ అవమానమును, కొరడా దెబ్బలను, మరియు సిలువ మరణమును ఆయనే ఎన్నుకొన్నాడు. సంభవించిన ఏ సంఘటననైనను సాతాను సమాళించలేదు; సమాళించినది యేసే. లొంగిపోవుటద్వారా పాపముపై విజయమును సాధించినది యేసే. దేవుని విమోచనా ప్రణాళిక ప్రకారము తనను తాను విమోచనా క్రయధనముగా చెల్లించుటకు బుద్ధిపూర్వకముగా ఎన్నుకొని విశ్వసించు వారిని ఆయన రక్షించాడు.*